

'తియ్యటి' ఉపాధి
బేకరీ పదార్థాల తయారీలో 74 ఉడేగోళం గ్రామస్తులది అందెవేసిన చేయి. వందమందికి పైగా దీనిద్వారా ఉపాధి పొందుతున్నారు. 8లో



టమాట కిలో రూ.24
కక్కలపల్లి మండీలో బుధవారం కిలో టమాట గరిష్ట ధర రూ.24 పలికింది. కనిష్టం రూ.8.50, సరాసరి రూ.15 ప్రకారం క్రయ విక్రయాలు సాగాయి.

గరిష్టం/కనిష్టం
34.3°/20.5°

జిల్లా అంతటా బుధవారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమైంది. ఉదయం చలి కొనసాగింది.

న్యూస్‌రీల్

జేఎన్‌టీయూ స్నాతకోత్సవ నోటిఫికేషన్
- జనవరి మొదటి వారంలో స్నాతకోత్సవం



అనంతపురం: జవహర్‌లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం- అనంతపురం (జేఎన్‌టీయూఏ) 13వ స్నాతకోత్సవం వచ్చే ఏడాది జనవరి మొదటి వారంలో నిర్వహించనున్నారు. స్నాతకోత్సవానికి రాష్ట్ర గవర్నర్, యూనివర్సిటీల చాన్సలర్ జస్టిస్ ఎస్.అబ్దుల్ నజీర్ అనుమతి లభించడంతో అధికారులు బుధవారం నోటిఫికేషన్ విడుదల చేశారు. 2021-22, 2022-23 విద్యా సంవత్సరాల్లో బీటెక్, బీ ఫార్మసీ, ఎం ఫార్మసీ, ఎంటెక్, పీహెచ్‌డీ పూర్తి చేసిన విద్యార్థులు స్నాతకోత్సవ పట్టాకు ఆన్‌లైన్ విధానంలో దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తు రుసుం రూ.2 వేలు చెల్లించాలి. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేశాక హార్డ్ కాపీలు యూనివర్సిటీకి పంపాల్సిన అవసరం లేదు. పూర్తి వివరాలు www.jntua.ac.inలో పరీక్షల విభాగం కింద తెలుసుకోవచ్చు.

ఎయిడ్స్ తగ్గుముఖం



మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ భ్రమరాంబదేవి

అనంతపురం మెడికల్: ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం తీసుకుంటున్న పటిష్ట చర్యలతో ఎయిడ్స్ తగ్గుముఖం పడుతోందని డీఎంహెచ్‌ఓ భ్రమరాంబదేవి పేర్కొన్నారు. డిసెంబర్ ఒకటి ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం ఆమె తన కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. జిల్లాలో గత ఐదేళ్లలో 2,390 మందికి హెచ్ఐవీ ఉన్నట్లు నిర్ధారణ అయ్యిందని, వారిలో 2,200 మంది ఏఆర్‌టీ కేంద్రాల్లో నమోదు చేసుకున్నారని తెలిపారు. వీరిలో 1,690 మంది క్రమం తప్పకుండా మందులు వాడుతున్నారన్నారు. హెచ్ఐవీతో జీవిస్తున్న గర్భిణుల నుంచి పిల్లలకు వైరస్ సంక్రమించకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. హెచ్ఐవీతో పోరాడిన వారి జ్ఞాపకాలను స్మరించుకుంటూ ప్రజల్లో అవగాహన తీసుకువస్తున్నట్లు తెలిపారు. వచ్చే నెల ఒకటో తేదీన అనంతపురం ఆర్ట్స్ కళాశాల నుంచి టవర్‌క్లాక్, సుభాష్‌రోడ్డు మీదుగా సప్తగిరి సర్కిల్ వరకు అవగాహన ర్యాలీ నిర్వహించనున్నట్లు చెప్పారు. జిల్లాలోని పీహెచ్‌సీల పరిధిలో అవగాహన ర్యాలీలు, తదితర కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. పాఠశాల, కళాశాల విద్యార్థులకు ఎయిడ్స్ పట్ల అవగాహన కల్పించేలా వక్తృత్వం వంటి పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ సుజాత, జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, క్షయ నియంత్రణ అధికారి డాక్టర్ అనుపమ జేమ్స్ పాల్గొన్నారు.

జాతీయ లోక్ అదాలత్ విజయవంతం చేయండి



మాట్లాడుతున్న ఉమ్మడి జిల్లా జడ్జి శ్రీనివాస్

అనంతపురం: డిసెంబర్ తొమ్మిదో తేదీ నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని ఉమ్మడి అనంతపురం జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీనివాస్ కోరారు. ఉమ్మడి జిల్లాల ఎస్పీలతో బుధవారం ఆయన తన చాంబర్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి మాట్లాడుతూ జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులకు పరిష్కారం చూపాలన్నారు. పోక్సో బాధితులకు పరిహారం అందజేయాలని నిర్ణయించారు. సమావేశంలో శ్రీ సత్యసాయి జిల్లా ఎస్పీ మాధవ్‌రెడ్డి, అనంతపురం ఏఎస్పీ ఆర్.విజయభాస్కర్‌రెడ్డి, సెబ్ అధికారి రామకృష్ణ, శ్రీ సత్యసాయి డీఆర్‌ఓ కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు కనకదాస జయంతి
అనంతపురం రూరల్: బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గురువారం కనకదాస జయంతి వేడుకలు నిర్వహిస్తున్నట్లు డీడీ కుష్బూ కొఠారి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు నగరంలోని గుత్తి రోడ్డులో ఉన్న కనకదాస విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించిన అనంతరం కనకదాస కల్యాణ మండపంలో జయంతి వేడుకలు ఉంటాయని పేర్కొన్నారు. జిల్లాలోని ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు హాజరవుతారని తెలిపారు.

పడేసే ముందు జాగ్రత్త!



- పనికిరావని నిర్లక్ష్యం చేయొద్దు
- చెత్తకుప్పల్లో కాలం చెల్లిన మందులు
- కుళ్లిన తర్వాత కొత్త బ్యాక్టీరియాతో జబ్బులు
- అధిక మోతాదు యాంటీబయాటిక్స్‌కూ లొంగవు
- కాలం చెల్లిన మందులను పద్ధతి ప్రకారమే నిర్వీర్యం చేయాలి

ఉమ్మడి జిల్లాలో మందుల షాపులు ఇలా	
మొత్తం మందుల షాపులు	2,200
హోల్‌సేల్ షాపులు	120
రిటైల్ షాపులు	2080
ఏటా మందుల వినియోగం విలువ	రూ.350 కోట్ల పైనే

సాక్షి ప్రతినిధి, అనంతపురం : ఆదమరిస్తే మందులూ విషమే అన్నది చాలామంది మరచిపోతున్నారు. జబ్బులను నయం చేస్తున్న మందులను చెత్తలో వేస్తే చాలా ప్రమాదకరమని వైద్యులు హెచ్చరిస్తున్నారు. బయో వ్యర్థాలను చెత్త డబ్బాల్లో వేయడం వల్ల కొత్త సమస్యలు ఏర్పడే అవకాశం ఉందంటున్నారు. వేలాది ఇళ్ల నుంచి వచ్చే రకరకాల మాత్రలు, సిరప్‌లు, ఆయింట్‌మెంట్‌లు మున్సిపాలిటీ చెత్త డబ్బాల్లో, మురికి కాలువల్లో పడేయడం వల్ల విషపూరిత వాతావరణం ఏర్పడుతోంది. దీనివల్ల ప్రమాకదరమైన హెపటైటిస్ వ్యాధులు వస్తున్నాయి. కాలం చెల్లిన/పనికి రాని మందులను పద్ధతి ప్రకారమే నిర్వీర్యం చేయాలని నిపుణులు సూచిస్తున్నారు.

మందులు కుళ్లిపోతే కొత్త సమస్యలు
- మందులు కుళ్లిపోవడం వల్ల ఆ వ్యర్థాల నుంచి కొత్తరకం బ్యాక్టీరియా పుట్టుకొస్తోంది.
- ఈ బ్యాక్టీరియా వల్ల కొత్త జబ్బులు సోకడమే కాదు..ఆ తర్వాత అధికా మోతాదు యాంటీబయాటిక్స్ వాడినా జబ్బులు తగ్గే అవకాశం ఉండదు.
- చెత్త కుప్పల్లో మందులు కుళ్లిపోవడం వల్ల వాయు కాలుష్యం తీవ్రమవుతుంది. గాలి ద్వారా వ్యాప్తి చెందే జబ్బుల ప్రభావం తీవ్రమవుతుంది.
- మందులు కుళ్లిపోవడం వల్ల భూగర్భ జలాలు విషతుల్యమవుతున్నాయి.
- ఈ జలాలు తాగడం వల్ల మూత్రపిండాలు, కాలేయ సమస్యలు వస్తున్నాయి.

ప్రత్యేక మార్గదర్శకాలు

హ్యూమన్ అనాటమిక్ వేస్ట్: అంటే రోగినుంచి వచ్చిన బాడీ ఫ్లూయిడ్స్, డ్రెస్సింగ్ వేస్ట్, బ్యాగ్‌లు, రక్తం నింపిన వేస్ట్, ఎక్స్‌పైరీ మందులు వంటివి. వీటిని పసుపు రంగు డబ్బాల్లో మాత్రమే వేయాలి. అనంతరం వీటిని అత్యధిక ఉష్ణోగ్రతలో నిర్వీర్యం చేయాలి.

కంటామినేటెడ్ వేస్ట్.. : రోగి శరీరంలో అమర్చి పడేయాల్సిన ట్యూబ్‌లు, యూరినల్ బ్యాగ్స్, సిరంజిలు, నీడిల్స్ వంటివి. వీటిని ఎరుపురంగు డబ్బాలో మాత్రమే వేయాలి. ఈ వ్యర్థాలను ఆటోక్లావింగ్ లేదా మైక్రో వేవింగ్ హైడ్రోక్లావింగ్ పద్ధతుల్లోనే నిర్వీర్యం చేయాలి.

పదునైన పరికరాలు : అంటే నీడిల్స్, సిరంజిలు, నీడిల్ కట్టర్‌లు, బర్నర్‌లు, బ్లేడ్‌లు ఇలా ఏవైనా విషపూరితమైన పదునైన వాటిని తెలుపు రంగు డబ్బాలో వేయాలి. వీటిని లీకేజీ లేని డబ్బాలో మాత్రమే వేయాలి. ఈ వ్యర్థాలను ఆటోక్లావింగ్ లేదా డ్రై హీట్ స్టెరిలైజేషన్ పద్ధతిలో కాల్చేయాలి.

గ్లాస్‌వేర్ వేస్ట్ :
అంటే విషపూరిత గాజు వస్తువులు, మెడిసిన్ వాయిల్స్ వంటివన్నీ. వీటిని నీలం రంగు డబ్బాలో మాత్రమే సేకరించాలి. వీటిని తిరిగి ఉపయోగించాలంటే డిటర్జంట్ లేదా సోడియం హైపోక్లోరైడ్ ద్రావణంతో శుభ్రం చేయాలి.

ఇంట్లో మిగిలిపోతే:
మాత్రలు, ఆయింట్‌మెంట్‌లు ఇంట్లో మిగిలిపోతే వాటిని రిటైలర్ లేదా మాన్యుఫాక్చరర్ కంపెనీలకు ఇవ్వాలి. చెత్తలో పడేయకూడదు.

> **మందులు చెత్తలో వేస్తే ప్రమాదం**
>
> రకరకాల మందులు, యాంటీబయాటిక్స్ వంటివి మిగిలిపోతే చెత్తలో పడేయకూడదు. వీటిని నిబంధనల మేరకు నిర్వీర్యం చేయాలి. లేదంటే హెపటైటిస్ వంటి ప్రమాదకర వ్యాధులొస్తాయి. చాలామందికి తెలియక అలాగే పడేస్తున్నారు. డాక్టర్లు కూడా దీనిపై అవగాహన కల్పించాలి. లేదంటే మందులు కుళ్లిపోయి కొత్త బ్యాక్టీరియా పుట్టుకొస్తుంది.
>
> –ఫణి మహేశ్వరరెడ్డి, జనరల్ సర్జన్, అనంతపురం

ఆర్‌బీకే సేవలపై విదేశీ బృందం సంతృప్తి



కళ్యాణదుర్గం వ్యవసాయ కార్యాలయంలో సమావేశమైన విదేశీ ప్రతినిధులు

కళ్యాణదుర్గం: ఏపీలో రైతు భరోసా కేంద్రం (ఆర్‌బీకే) ద్వారా అందుతున్న వ్యవసాయ సేవలపై విదేశీ బృందం సంతృప్తి వ్యక్తం చేసింది. నెదర్లాండ్‌కు చెందిన రాబో బ్యాంక్ ప్రతినిధి లూరా, ఇతర సభ్యులు ఓంద్రేజ్, జోరీస్, సోఫియాలతో కూడిన బృందం ఆర్‌బీకే సేవలను పరిశీలించేందుకు బుధవారం ఆర్డీటీ ఏఎఫ్ ఎకాలజీ సెంటర్ డైరెక్టర్ డాక్టర్ మల్లారెడ్డి నేతృత్వంలో కళ్యాణదుర్గం ప్రాంతంలో పర్యటించింది. కళ్యాణదుర్గం మండలం గూబనపల్లి, గోళ్ల, కంబదూరు మండలంలోని పలు గ్రామాల్లోని రైతులను కలిసి వ్యవసాయ పద్ధతులు, పంటల సాగు, నేల స్వభావం వంటి వాటిపై ఆరా తీసింది. అనంతరం కళ్యాణదుర్గంలోని ఆర్‌బీకే సెంటర్‌ను పరిశీలించి.. రైతులకు అందుతున్న సేవలపై అడిగి తెలుసుకుంది. అనంతరం ఏఈఓ దిలీప్‌కుమార్, హార్టికల్చర్ అధికారి కృష్ణతేజ, ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ రాంసింగ్‌లతో విడివిడిగా సమావేశమై ఇక్కడి ప్రాంత వ్యవసాయ భూమి, అటవీ భూములు, ఇతర వ్యవసాయ సంబంధిత విషయాలపై అడిగి తెలుసుకున్నారు. ఇక్కడి రైతులకు వ్యవసాయంపై ఎంతో మక్కువ ఉందని విదేశీయులు సంతోషం వెలిబుచ్చారు. రైతులకు మేలు జరిగేలా ఆర్డీటీ సహకారంతో మరిన్ని కార్యక్రమాలు చేసేలా ప్రణాళికలు తయారు చేస్తే బాగుంటుందనే విషయాన్ని గుర్తుచేశారు. కార్యక్రమంలో ఆర్‌బీకేల ఇన్‌చార్జ్‌లు అశోక్, నరసింహరాజు, నాగరాజుతో పాటు వ్యవసాయ, అటవీ శాఖ సిబ్బంది, ఆర్డీటీ సిబ్బంది పాల్గొన్నారు.

సూక్ష్మస్థాయిలో పరిశీలన

- ఇంటింటి సర్వేలో అందిన క్లెయిమ్‌లు 2.97 లక్షలు
- ఇప్పటి వరకు పరిష్కరించినవి 2.05 లక్షలు
- తిరస్కరించినవి 24 వేలు, పెండింగ్‌లో 67 వేలు



ఎంపీడీఓ కార్యాలయంలో దరఖాస్తుల పరిశీలనపై అధికారులకు సూచనలిస్తున్న కలెక్టర్ గౌతమి (ఫైల్)

అనంతపురం అర్బన్: ప్రత్యేక ఓటరు జాబితా సవరణ-2024లో భాగంగా నిర్వహించిన ఇంటింటి సర్వేలో వచ్చిన అభ్యంతరాలు, క్లెయిమ్‌లను సూక్ష్మస్థాయిలో పరిశీలన చేస్తున్నారు. మొత్తం క్లెయిమ్‌లు 2,97,458 రాగా.. అందులో అనర్హమైనవిగా గుర్తించిన 24,374 దరఖాస్తులను తిరస్కరించారు. మిగిలిన వాటిలో ఇప్పటి వరకు 2,05,653 దరఖాస్తులు పరిష్కరించారు. ఎన్నికల కమిషన్ జారీ చేసిన షెడ్యూల్ ప్రకారం డిసెంబరు 9 నాటికి క్లెయిమ్‌లను పరిష్కరించాల్సి ఉంటుంది. ఓటరు జాబితా సవరణలో భాగంగా ఇంటింటి సర్వే నిర్వహించిన సమయంలో ఓటరుగా నమోదుకు సంబంధించి ఫారం-6 దరఖాస్తులు 98,107 వచ్చాయి. వీటిలో ఇప్పటి వరకు 75,987 దరఖాస్తులు పరిష్కరించారు. 8,265 దరఖాస్తులు తిరస్కరించారు. 13,855 దరఖాస్తులు పరిష్కరించాల్సి ఉంది.
- ఓటు తొలగింపునకు సంబంధించి ఫారం-7 దరఖాస్తులు 91,548 వచ్చాయి. వీటి పరిష్కారంలో అధికారులు అత్యంత జాగ్రత్తగా వ్యవహరిస్తూ సూక్ష్మస్థాయి పరిశీలన నిర్వహిస్తున్నారు. ఏ దశలోనూ తొందరపాటుకు ఆస్కారమివ్వకుండా ప్రతి దరఖాస్తునూ పరిశీలిస్తున్నారు. అదే క్రమంలో సదరు వ్యక్తులకు నోటీసు ఇస్తున్నారు. ఈ క్రమంలో వీటి పరిష్కారం నెమ్మదిగా సాగుతోంది. ఇలా ఇప్పటి వరకు 39,103 పరిష్కరించారు. 12,759 దరఖాస్తులను తిరస్కరించారు. 39,686 దరఖాస్తులు పరిష్కరించాల్సి ఉంది.
- ఓటరు వివరాల్లో చేర్పులు, మార్పులకు సంబంధించి ఫారం 8 కింద 1,07,803 దరఖాస్తులు వచ్చాయి. ఇందులో ఇప్పటి వరకు 90,563 పరిష్కరించారు. 3,350 దరఖాస్తులు తిరస్కరించారు. 13,890 దరఖాస్తులు పరిష్కరించాల్సి ఉంది.

మంత్రాలయం ప్యాసింజర్ సేవలు పొడిగింపు
గుంతకల్లు: మంత్రాలయం ప్యాసింజర్ సేవలను రానున్న జనవరి ఒకటో తేదీ వరకు పొడిగించినట్లు రైల్వే డివిజనల్ కార్యాలయ అధికారులు తెలిపారు. నేటితో (30వ తేదీతో) గుంతకల్లు-మంత్రాలయం (07411) డైలీ ప్యాసింజర్ గడువు ముగుస్తోంది. ప్రయాణికుల రద్దీ దృష్ట్యా ఈ రైలును డిసెంబర్ 31 వరకు పొడిగించారు. అదేవిధంగా మంత్రాలయం-గుంతకల్లు (07412) డైలీ ప్యాసింజర్‌ను జనవరి 1 వరకు పొడిగించినట్లు వివరించారు. ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాల న్నారు.

ప్రజాభిమానం మరువలేనిది



కొనకొండ్లలో సంక్షేమ లబ్ధి వివరాల బుక్‌లెట్ అందిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, నియోజకవర్గ సమన్వయకర్త వై.విశ్వేశ్వరరెడ్డి తదితరులు



'గడప గడపకూ మన ప్రభుత్వం' ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా, ప్రజాప్రతినిధులు, నాయకులు

- జగన్ పాలనపై ప్రజల సంతృప్తి
- మళ్లీ ఆయనే సీఎం కావాలని కోరుకుంటున్నారు
- 'గడప గడపకూ' ముగింపు సభలో మాజీ ఎమ్మెల్యే విశ్వ

ఉరవకొండ: 'గడప గడపకూ మన ప్రభుత్వం' పేరిట సంక్షేమ పథకాల అమలు తీరు, స్థానిక సమస్యలు తెలుసుకుని అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చర్యలు తీసుకునేందుకు వెళ్లినపుడు ప్రజలు చూపిన అభిమానం మరువలేనిదని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త వై.విశ్వేశ్వరరెడ్డి అన్నారు. ఉరవకొండ నియోజకవర్గంలో 150 రోజులపాటు 76 సచివాలయాల పరిధిలో 'గడప గడపకూ మన ప్రభుత్వం' కార్యక్రమం సాగింది. వజ్రకరూరు మండలం కొనకొండ్లలో బుధవారం ముగింపు సభ నిర్వహించారు. జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలో మొత్తం 35,280 గడపలను సందర్శించామని, 12 వేల సమస్యలను గుర్తించామని, అందులో 90 శాతం పరిష్కరించామని వెల్లడించారు. మిగిలిన 232 సమస్యలు కలెక్టర్ పరిధిలో ఉన్నాయని, అవి కూడా త్వరలోనే పరిష్కారం అవుతాయని చెప్పారు. పారదర్శక పాలన, అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాల అమలు అవుతుండటంపై ప్రజలు సంతృప్తి వ్యక్తం చేశారన్నారు. ముఖ్యంగా సాధారణ ప్రజల జీవన ప్రమాణాలు, వారి కొనుగోలు శక్తి పెరిగిందన్నారు. మళ్లీ జగనే ముఖ్యమంత్రి కావాలని ప్రజలు ముక్తకంఠంతో కోరుతున్నారని తెలిపారు. గడప గడపలోనూ తనను ఆదరించి, ఆశీర్వదించిన ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య మాట్లాడుతూ నియోజకవర్గంలో 'గడప గడపకూ మన ప్రభుత్వం' కార్యక్రమం దిగ్విజయంగా ముగించారన్నారు. మేనిఫెస్టో హామీల్లో 99 శాతం అమలు చేసి సీఎం జగన్ రికార్డు సృష్టించారన్నారు. తెలుగుదేశం అధినేత చంద్రబాబు, దత్త పుత్రుడు పవన్ కళ్యాణ్ ఓట్ల కోసం ఉత్తుత్తి హామీలు ఇచ్చేందుకు వస్తున్నారని, ప్రజలు ఎట్టి పరిస్థితుల్లోనూ నమ్మరాదన్నారు. గత ఎన్నికల్లో చంద్రబాబు 600 హామీలు ఇచ్చి అమలు చేయకుండా అన్ని వర్గాలనూ మోసగించిన తీరును ఈ సందర్భంగా ప్రజలకు గుర్తు చేశారు. కార్యక్రమంలో ఏపీ వ్యవసాయ మిషన్ సభ్యులు రాజారాం, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు వీరన్న, ఎస్సీ సెల్ రీజనల్ ఇన్‌చార్జ్ పెన్నోబులేసు, వజ్రకరూరు, ఉరవకొండ ఎంపీపీలు రమావత్‌దేవి, వెలిగొండ నరసింహులు, జెడ్పీటీసీ సభ్యులు ఏసీ పార్వతమ్మ, హనమంతు, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షులు సోమశేఖర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ ఉస్మాన్, వశికేరి రమేష్, కొనకొండ్ల గ్రామ నాయకులు దాసరి గోవిందు, బోయ గోవిందు, సంజప్ప, చైతన్య, కిష్టప్ప, ఉన్నం రాధాకృష్ణ, రంగనాథ్‌యాదవ్, లింగరాజు, బాలు తదితరులు పాల్గొన్నారు.

నిష్పక్షపాతంగా వ్యవహరిస్తున్నాం



రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమి

అనంతపురం అర్బన్: ప్రత్యేక ఓటరు జాబితా సవరణ ప్రక్రియలో అందిన క్లెయిమ్‌లు, అభ్యంతరాల పరిశీలన, పరిష్కారంలో నిష్పక్షపాతంగా వ్యవహరిస్తున్నామని కలెక్టర్ గౌతమి స్పష్టం చేశారు. ఓటరు జాబితా సవరణ అంశంపై కలెక్టర్ బుధవారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాలులో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. క్లెయిమ్‌లు, అభ్యంతరాలను జాగ్రత్తగా పరిశీలించి పరిష్కరిస్తామన్నారు. పార్టీల ప్రతినిధులు క్షేత్రస్థాయిలో సమస్యలను తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. చేర్పులు, తొలగింపునకు అందిన ఫారం-7 దరఖాస్తులను ఈఆర్‌ఓలు స్వయంగా పరిశీలిస్తారన్నారు. ఫారం 6, 8 దరఖాస్తులు పరిష్కరించామన్నారు. ఫారం-7 దరఖాస్తుల్లో కొన్ని పెండింగ్ ఉన్నాయన్నారు.

తప్పుడు ఫిర్యాదులపై కేసులు
ఉద్దేశపూర్వకంగా లేదా అనవసరంగా తప్పుడు ఫిర్యాదులు చేయకూడదని కలెక్టర్ అన్నారు. తప్పుడు ఫిర్యాదులు ఇచ్చే వారిపై కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఫిర్యాదు చేసే ముందుకు ఒకటికి రెండుసార్లు పరిశీలించుకోవాలని సూచించారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలు తమ పార్టీ బూత్ లెవల్ ఏజెంట్లను కూడా క్షేత్రసాయిలో క్రియాశీలకంగా పనిచేసేలా చూడాలన్నారు.

ఈవీఎంలపై అవగాహన
ఈవీఎంల వినియోగంపై ప్రజలకు డిసెంబరు 1 నుంచి అవగాహన కల్పిస్తామని కలెక్టర్ తెలిపారు. కలెక్టరేట్, మూడు ఆర్డీఓ కార్యాలయాలు, ఐదు నియోజకవర్గాల కేంద్రాల్లోని తాలుకా కార్యాలయాల్లో వ్యాన్‌లు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. వాటిలో ఈవీఎంలు, వీవీప్యాట్‌లు ఉంచి ప్రజలకు అవగాహన కల్పిస్తామన్నారు. 18-19 ఏళ్లు నిండిన వారు ఓటరు నమోదుకు దరఖాస్తు చేసుకున్నారా లేదా అనేది నాయకులు తెలియజేయాలన్నారు. ఓటు హక్కు నమోదుపై డిసెంబరు 2, 3 తేదీల్లో ప్రత్యేక డ్రైవ్ చేపడతామన్నారు. సమావేశంలో డీఆర్‌ఓ గాయత్రీదేవి, రాజకీయ పార్టీల ప్రతినిధులు కేవీ రమణ, సోమశేఖర్‌రెడ్డి, పవన్‌కుమార్, ఎంఎండీ ఇమామ్, మసూద్‌వలి, హరిప్రసాద్, బాలరంగయ్య, తహసీల్దారు భాస్కర్, డీటీ కనకరాజు తదితరులు పాలొన్నారు.

ఖాళీల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం
అనంతపురం మెడికల్: నేషనల్ హెల్త్ మిషన్ (ఎన్‌హెచ్ఎం) పరిధిలోని వివిధ పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో ఖాళీగా ఉన్న వైద్యులు, తదితర సిబ్బంది పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఎంహెచ్‌ఓ డాక్టర్ భ్రమరాంబదేవి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం నుంచి అనంతపురం వెబ్‌సైట్‌లో దరఖాస్తులు డౌన్‌లోడ్ చేసుకుని వచ్చే నెల 8వ తేదీ సాయంత్రం 5.30 గంటలలోపు డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో అందజేయాల్సి ఉంటుందని తెలిపారు. 15 మెడికల్ ఆఫీసర్లు, ఆడియోమెట్రీషియన్, గ్రేడ్ 2 ఫార్మసిస్టు, ల్యాబ్ టెక్నీషియన్, మల్టీ రిహాబిలిటేషన్ వర్కర్స్, డెంటల్ హైజీనిస్టు, రెండు క్లినికల్ సైకాలజిస్టు పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానించినట్లు వెల్లడించారు.

కంటి శస్త్ర చికిత్సలు షురూ
అనంతపురం మెడికల్: ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో కంటి శస్త్ర చికిత్సలు షురూ అయ్యాయి. కొన్ని నెలల క్రితం శస్త్రచికిత్సలు వికటించడంతో కంటి ఆపరేషన్ థియేటర్‌ను మూసిన విషయం విదితమే. కల్చర్ స్వాప్ మూడు సార్లు పంపగా నెగిటివ్ రావడంతో శస్త్ర చికిత్సలు బుధవారం నుంచి మొదలుపెట్టారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి సంబంధించి కంటి శుక్లం ఆపరేషన్లను వేగవంతం చేసేలా చర్యలు తీసుకుంటామని సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వర రావు తెలిపారు.

కేజీబీవీ పార్ట్‌టైం పీజీటీలకు శుభవార్త

- రెండింతలకు పైగా పెరిగిన జీతం
- రూ.12 వేల నుంచి రూ. 26,759కు పెంచుతూ ప్రభుత్వ నిర్ణయం
- జిల్లాలో 26 మంది ఉద్యోగులకు లబ్ధి



అనంతపురం ఎడ్యుకేషన్: కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల్లో (కేజీబీవీ) పని చేస్తున్న పార్ట్‌టైం పీజీటీలకు ప్రభుత్వం శుభవార్త చెప్పింది. ఒకేసారి రెండింతలకు పైగా జీతాలు పెంచుతూ నిర్ణయం తీసుకుంది. వారు రిక్రూట్ అయినప్పటి నుంచి రూ.12 వేల వేతనంతో పని చేస్తున్నారు. డిసెంబర్ నుంచి రూ.26,759 వేతనం తీసుకోనున్నారు. ఈ మేరకు ఉత్తర్వులను సమగ్ర శిక్ష స్టేట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ (ఎస్పీడీ) శ్రీనివాసరావు జారీ చేశారు.

జిల్లాలో 26 మంది పీజీటీలకు లబ్ధి
కేజీబీవీల్లో పార్ట్ పీజీటీలు ఇంటర్ తరగతులు బోధిస్తున్నారు. అనంతపురం జిల్లాలో 26 మంది పార్ట్‌టైం పీజీటీలుగా పని చేస్తున్నారు. ఆశించిన స్థాయిలో ఒకేమారు జీతాలు పెంచడంతో వారంతా సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు. మా కష్టాలను గుర్తించిన ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలుపుతున్నట్లు ప్రకటించారు.

ఖాళీగా ఉన్న పీజీటీ, ప్రిన్సిపాల్ పోస్టులకు నోటిఫికేషన్
కేజీబీవీల్లో ఖాళీగా ఉన్న ప్రిన్సిపాల్, పీజీటీ పోస్టుల భర్తీకి ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసింది. అయితే ఇటీవల రిక్రూట్‌మెంట్ చేసిన సమయంలో తయారు చేసిన మెరిట్ జాబితాలోని రెండో అభ్యర్థికి అవకాశం కల్పించనున్నారు. కౌన్సెలింగ్ ద్వారా ఆయా ఖాళీలకు కేటాయిస్తారు. ఈ మేరకు సమగ్ర శిక్ష ఎస్పీడీ శ్రీనివాసరావు ఉత్తర్వులు జారీ చేశారు. గురువారం నుంచి ఈ ప్రక్రియను ప్రారంభించి డిసెంబరు 4 నాటికి పూర్తి చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. కాగా ఉమ్మడి అనంతపురం జిల్లాలో రెండు ప్రిన్సిపాల్ పోస్టులతో పాటు 35 పీజీటీ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వీటన్నింటినీ భర్తీ చేయనున్నారు.

> **ఉత్తర్వుల మేరకు చర్యలు**
>
> పార్ట్‌టైం పీజీటీలకు జీతాల పెంపు, ఖాళీ పోస్టుల నోటిఫికేషన్‌కు సంబంధించిన ఉత్తర్వులు జిల్లాకు వచ్చాయి. ఉమ్మడి జిల్లాలో ఖాళీగా ఉన్న రెండు ఎస్‌ఓ, 35 పీజీటీ పోస్టులకు సంబంధించి గతంలో రిక్రూమెంట్ సమయంలో తయారు చేసిన జాబితాలోని తర్వాత వారికి అవకాశం కల్పిస్తాం. కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రక్రియను ప్రశాంతంగా పూర్తి చేస్తాం.
>
> – జూలుకుంట వరప్రసాదరావు, ఏపీసీ, సమగ్ర శిక్ష

క్లుప్తంగా

ప్రతి మహిళ ఆర్థికంగా ఎదగాలి



మెప్మా అర్బన్ మార్కెట్‌ను ప్రారంభిస్తున్న మంత్రి ఉషశ్రీచరణ్

కళ్యాణదుర్గం: ప్రతి మహిళ ఆర్థికంగా ఎదగాలన్నదే సీఎం జగనన్న లక్ష్యమని మంత్రి కేవీ ఉషశ్రీ చరణ్ అన్నారు. పట్టణ మహిళల ఆర్థిక పరిస్థితిని మెరుగు పరుస్తూ స్థానిక టీ సర్కిల్ సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన స్వయం సహాయక సంఘాల మహిళల ఉత్పత్తుల మార్కెట్‌ను బుధవారం ఆమె ప్రారంభించి, మాట్లాడారు. వైఎస్సార్ చేయూత, ఆసరా పథకాలతో పాటు సున్నావడ్డీ రుణాలు తీసుకున్న పొదుపు సంఘాల మహిళలకు స్వయం ఉపాధి కల్పించేలా అర్బన్ మార్కెట్‌లను అందుబాటులోకి తీసుకురావడం గర్వించదగ్గ విషయమన్నారు. మార్కెట్‌లో విక్రయానికి ఉంచిన వస్తువులు ఎంతో నాణ్యతగా ఉన్నాయన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకటేశులు, మున్సిపల్ వైస్ చైర్మన్ జయం ఫణి, మెప్మా పట్టణ అధ్యక్షురాలు హేమ, వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ గోపారం శ్రీనివాసులు, నాయకులు సుధీర్, తిరుమల వెంకటేశులు, అర్చన, బిక్కి నాగలక్ష్మి, లక్ష్మన్న, గంగాధర్, అంజి, జోసెఫ్ కిషోర్, హరినాథరెడ్డి, బ్రహ్మయ్య, సుధాకర్‌రెడ్డి, మహిళా రిసోర్స్ పర్సన్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తియ్యటి ఉపాధి

- బేకరీ పదార్థాల తయారీలో 'ఉడేగోళం' వాసులది అందె వేసిన చేయి
- ఒకరితో మొదలై నేడు వంద మందికి పైగా ఇదే ఉపాధి
- 'దుర్గం'లో మెజార్టీ బేకరీలు వారివే
- ఇతర ప్రాంతాల్లోనూ నిర్వహణ

గ్రామం	74 ఉడేగోళం
మండలం	రాయదుర్గం
కుటుంబాలు	961





కర్ణాటకలోని జిందాల్ వద్ద బేకరీ నిర్వహిస్తున్న ప్రవీణ్

సాక్షి, అనంతపురం డెస్క్: వ్యవసాయమే వారికి జీవనాధారం. వివిధ పంటలు పండిస్తూ మంచి లాభాలు ఆర్జించేవారు. సాఫీగా సాగుతున్న వారి బతుకులను సరిగ్గా పాతికేళ్ల క్రితం కరువు ఛిద్రం చేసింది. వ్యవసాయ బోర్లలో నీళ్లు ఇంకిపోయాయి. పంటలన్నీ ఎండిపోయాయి. బతుకు భారమైంది. చేసేది లేక మూటాముల్లె సర్దుకుని వలస బాట పట్టారు. ఈ పరిస్థితులే వారిని కొత్త రంగానికి పరిచయం చేశాయి. నేడు బేకరీ పదార్థాల తయారీ, నిర్వహణలో ప్రత్యేకతను చాటుకుంటున్నారు. ఏపీ, కర్ణాటకలోని వివిధ ప్రాంతాల్లో సొంత బేకరీల ఏర్పాటుతో పాటు వర్కర్లుగానూ పనిచేస్తూ 'తియ్యటి' ఉపాధి పొందుతున్నారు. తద్వారా ఆర్థికంగానూ ఎదుగుతున్నారు. వారే రాయదుర్గం మండలం 74 ఉడేగోళం వాసులు.

ఒక్కడితో మొదలై..

తొలుత 74 ఉడేగోళం గ్రామానికి చెందిన ప్రవీణ్ అనే యువకుడు మహారాష్ట్రకు వలస వెళ్లాడు. అక్కడ ఓ బేకరీలో చేరి పొట్టపోసుకున్నాడు. పని నేర్చుకున్నాక కర్ణాటకలోని బళ్లారి జిల్లా జిందాల్ వద్ద బేకరీలో వర్కర్‌గా చేరాడు. చివరకు ఆ బేకరీకే ఓనర్‌గా ఎదిగాడు. అక్కడ మొదలైన మార్పు గ్రామంలోని చాలామంది యువతకు మార్గనిర్దేశకమైంది. అతణ్ని ఆదర్శంగా తీసుకున్న పలువురు యువకులు ఆ రంగం వైపు దృష్టి మళ్లించారు. ప్రవీణ్ రాయదుర్గం పట్టణంలోని తేరుబజారులో తన బంధువుతో 20 ఏళ్ల క్రితం ఓ బేకరీ తెరిపించాడు. అలా మొదలై ఒకటి వెంట ఒకటి వెలుస్తూ నేడు పట్టణంలో బేకరీల సంఖ్య 15కు చేరింది. రాయదుర్గంలో ఏవీధికెళ్లినా ఉడేగోళం వాసుల బేకరీలే ఉండడం గమనార్హం. అలాగే కర్ణాటకలోని జిందాల్, తోరణగల్లు, బళ్లారి, చెళ్లకెర, చిత్రదుర్గం, రాష్ట్రంలోని కర్నూలు, అనంతపురం తదితర ప్రాంతాల్లో బేకరీల ఏర్పాటుతో పాటు వర్కర్లగానూ పని చేస్తూ ఉపాధి పొందుతున్నారు.

వంద మందికి పైగా..

74 ఉడేగోళం గ్రామంలో వంద మందికి పైగా బేకరీలపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. కొందరు సొంత బేకరీలు ఏర్పాటు చేసుకోగా..మరికొందరు స్వీట్ల తయారీ మాస్టర్లుగా రాణిస్తున్నారు. రాయదుర్గం, కళ్యాణదుర్గం నియోజకవర్గాల్లోని పలు ప్రాంతాలకు చెందిన యువకులు సైతం వీరి వద్ద స్వీట్ల తయారీలో శిక్షణ తీసుకుంటుండడం గమనార్హం. ట్రెండ్స్‌కు తగ్గట్టుగా పలు రకాల స్వీట్లు, బిస్కెట్లు, కేక్‌ల తయారీలో ఉడేగోళం వాసులది అందె వేసిన చేయి. దిల్ పసంద్ అంటేనే రాయదుర్గం గుర్తొచ్చేలా నైపుణ్యత సాధించారు.

శ్రమకు తగ్గ ప్రతిఫలం

నా ఒక్కడితో మొదలైన ఈ వ్యాపారం ఎన్నో కుటుంబాలకు మేలు చేసింది. చాలా మంది ఈ రంగాన్ని ఎంపిక చేసుకుని నా కంటే బాగా రాణిస్తుండడం సంతోషాన్నిస్తోంది. ఈ రంగం వైపు ఎవరు వస్తామన్నా ప్రోత్సహిస్తున్నాం. వారికి అవసరమైన సలహాలు, సూచనలు అందిస్తున్నాం.

– ప్రవీణ్, బేకరీ నిర్వాహకుడు, జిందాల్

ప్రవీణ్‌ను ఆదర్శంగా తీసుకున్నాం



రాయదుర్గం పట్టణంలోని కణేకల్లు రోడ్డులో 12 ఏళ్లుగా బేకరీ నిర్వహిస్తున్నా. స్థానికంగానే ఉపాధి పొందుతూ మరి కొంత మంది యువతకు కూడా ఉపాధి కల్పించా. ఇది మా గ్రామానికి చెందిన ప్రవీణ్ వల్లే సాధ్యమైంది.

– పృథ్వీ, బేకరీ నిర్వాహకుడు, 74 ఉడేగోళం

బేకరీలే మమ్మల్ని ఆదుకున్నాయి



వ్యవసాయంలో వస్తున్న నష్టాలు, కష్టాలు భరించలేక పదేళ్ల క్రితం భర్త నాగరాజుతో కలసి బేకరీ వ్యాపారం చేపట్టాం. రాయదుర్గం లక్ష్మీబజార్‌లోని అనంతపురం బస్టాప్ వద్ద బేకరీ ఉండడంతో నిత్యం రద్దీగా ఉంటుంది. పలురకాల స్వీట్లు, బిస్కెట్లను మేమే తయారుచేస్తాం.

– వినూత, బేకరీ నిర్వాహకురాలు, 74 ఉడేగోళం

దుర్గంలో మాదే మొదటి బేకరీ



వ్యవసాయంలో నష్టాల తర్వాత బేకరీ వైపు అడుగులు వేశాను. ప్రవీణ్ ప్రోత్సాహంతో రాయదుర్గంలో తొలి బేకరీ నేనే నెలకొల్పాను. ఆ తర్వాత మా గ్రామం నుంచి చాలా మంది పట్టణంలో బేకరీ వ్యాపారం చేపట్టారు. అందరూ విజయవంతమయ్యారు.

– ఉమేష్, 74 ఉడేగోళం

మైనర్‌కు పెళ్లి!

- భర్త లేని సమయాల్లో బలాత్కరించబోయిన మామ
- వేధింపులు తాళలేక పుట్టింటికి చేరిన బాలిక
- జరిగిన మోసంపై పోలీసులకు ఫిర్యాదు



బాలికను పెళ్లి చేసుకున్న హరికృష్ణ (ఫైల్)

అనంతపురం క్రైం: పేదరికం, తల్లి అనారోగ్యం కారణాలను ఆసరాగా చేసుకున్న దుర్మార్గులు ఓ బాలికను పోరంబోకుకు కట్టబెట్టారు. తండ్రి స్థానంలో ఉన్న మామ బలాత్కరించబోగా తప్పించుకుని బయటపడిన బాలిక నేరుగా తల్లి చెంతకు చేరింది. వివరాలు... అనంతపురం నగర శివారులోని ఓ కాలనీకి చెందిన బాలిక తండ్రి చిన్నప్పుడే మృతి చెందాడు. అప్పటి నుంచి తల్లి కూలి పనులు చేస్తూ ఏడో తరగతి వరకూ చదివించింది. ఈ క్రమంలోనే ఆమె అనారోగ్యం బారిన పడింది. ఇల్లు గడవడం కష్టంగా మారింది. దీంతో పెళ్లిళ్ల పేరయ్య చాకలి చౌడప్ప ఓ వరుడి తరఫున పెద్ద ఎత్తున కమీషన్ దండుకుని బాలిక తల్లిని మరింత ఆందోళనకు గురి చేశారు. చనిపోతే బిడ్డ భవిష్యత్తు ఏమిటంటూ ఆమెను భయపెట్టాడు. ఈ క్రమంలోనే కంబదూరు మండలం, పాళ్లూరు నివాసి, మరో కులానికి చెందిన యువకుడు హరికృష్ణ, కుటుంబసభ్యులను పిలిపించి పెళ్లి చూపులు సిద్ధం చేయించాడు. తనకు ఇప్పుడే పెళ్లి వద్దని చెప్పిన బాలికను దబాయించి, భయపెట్టారు. పెళ్లికొడుక్కి హిందూపురంలో ఓ పెట్రోలు బంకు, 15 ఎకరాల భూమి, రూ.కోట్లలో డబ్బుందని నమ్మించి ఆగస్టు 27న పాపంపేటలోని రామాలయంలో పెళ్లి జరిపించేశారు. పెళ్లి సమయంలో అనుమానాలు వ్యక్తం చేసిన వారికి అప్పటికే బాలిక వయసు13 ఏళ్లు కాగా, 19 ఏళ్లుగా మార్చేసిన ఆధార్ కార్డును చూపించి మభ్యపెట్టారు. హిందూపురంలో తనదిగా చెప్పుకున్న పెట్రోలు బంకులోనే హరికృష్ణ కాపురం పెట్టాడు. భర్త లేని సమయాల్లో మామ బాలికతో అసభ్యంగా ప్రవర్తించేవాడు. ఈ విషయాన్ని బాలిక అత్తకు తెలిపినా ఫలితం లేకపోవడంతో తనను చూసేందుకు వచ్చిన తల్లితో మొరపెట్టుకుంది. ఆ సమయంలో తల్లీబిడ్డపై కుటుంబసభ్యులంతా దాడి చేయబోగా తప్పించుకున్న అనంతపురానికి చేరుకున్న ఆమె పెళ్లిళ్ల పేరయ్యతో పాటు పెళ్లికి పెద్ద మనుషులుగా వ్యవహరించిన నిలదీసింది. దీనిపై వారు స్పందించకపోవడంతో బుధవారం ఉదయం నాల్గో పట్టణ పోలీసులకు తల్లి, బాలిక ఫిర్యాదు చేశారు. ఘటనపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఘనంగా గజగౌరీ దేవి ఊరేగింపు



పోటీలను ప్రారంభిస్తున్న ఎంపీ రంగయ్య

బొమ్మనహాళ్: కార్తీక మాసాన్ని పురస్కరించుకుని గ్రామీణ మహిళలు భక్తి శ్రద్ధలతో ఆచరించే గజగౌరీ ఉత్సవాలు బుధవారం ముగిశాయి. బొమ్మనహాళ్ మండలంలోని వివిధ గ్రామాల్లో కొలువుదీర్చిన గజగౌరీదేవి ప్రతిమలను ఘనంగా ఊరేగించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొనడంతో వీధులన్నీ కిక్కిరిసాయి. ఉద్దేహాళ్, ఉంతకల్లు, బొమ్మనహాళ్, శ్రీధరఘట్ట, కురువళ్లి, కృష్ణాపురం, లింగదహాళ్, దేవగిరి క్రాస్, నేమకల్లు, గోనేహాళ్ తదితర గ్రామాల్లో గజగౌరీదేవి ఊరేగింపు ఘనంగా సాగింది.

హోరాహోరీగా వృషభాల బలప్రదర్శన

గజగౌరీ ఉత్సవాల్లో భాగంగా ఉద్దేహాళ్‌లోని జెడ్పీ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో బుధవారం నిర్వహించిన రాష్ట్ర స్థాయి వృషభాల బల ప్రదర్శన హోరాహోరీగా సాగింది. పోటీలను ఎంపీ తలారి రంగయ్య ప్రారంభించారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందిన రైతులు 10 జతల వృషభాలను పోటీలకు తీసుకువచ్చారు. బెళుగుప్ప మండలం గంగవరానికి చెందిన రైతు వెంకటేష్ వృషభాలు మొదటి బహుమతి, ఆత్మకూరు మండలం తోపుదుర్తి గ్రామ రైతు చెన్నప్ప వృషభాలు రెండో బహుమతి, కళ్యాణదుర్గం మండలం బోరంపల్లి రైతు నీరుగంటి నాగరాజు వృషభాలు మూడో బహుమతి, రాయదుర్గం రైతు బంగి క్రిష్ణయ్య వృషభాలు నాల్గో బహుమతి గెలుచుకున్నాయి. బహుమతులను మండల వైఎస్సార్‌సీపీ మాజీ కన్వీనర్ ఈశ్వరరెడ్డి, మాజీ సర్పంచ్ కోటేశ్వరరెడ్డి, నాయకులు విశ్వనాథ్‌రెడ్డి, ప్రసాదరెడ్డి ఆధ్వర్యంలో పంపిణీ చేశారు.

వాల్మీకి జీవితం... ఆదర్శం

- మహర్షి అడుగుజాడల్లో నడుద్దాం
- విప్ కాపు, ఎంపీ రంగయ్య



వాల్మీకి విగ్రహానికి నివాళులర్పిస్తున్న విప్ కాపు (చిత్రంలో)ఎంపీ రంగయ్య, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, డీసీసీబీ చైర్‌పర్సన్ లిఖిత, తదితరులు

రాయదుర్గం: మహర్షి వాల్మీకి జీవితం ఆదర్శప్రాయమని, ఆ మహనీయుని అడుగుజాడుల్లో నడుద్దామంటూ నేటితరానికి ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి, ఎంపీ తలారి రంగయ్య, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, డీసీసీబీ చైర్‌పర్సన్ నిఖిత పిలుపునిచ్చారు. రాయదుర్గం మండలం టి.వీరాపురంలో బుధవారం బొడ్డురాయి, గ్రామదేవత (పోలేరమ్మ), అడవి సుంకులమ్మ, వాల్మీకి విగ్రహాల ప్రతిష్టాన కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమాలకు ముఖ్య అతిథులుగా విప్, ఎంపీ, జెడ్పీ చైర్‌పర్సన్, డీసీసీబీ చైర్‌పర్సన్‌తో పాటు వాల్మీకి కార్పొరేషన్ చైర్మన్ పొగాకుల రామచంద్ర, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి తిప్పేస్వామి, పామిడి వీరాంజినేయులు, జెడ్పీటీసీ సభ్యుడు హొన్నే మల్లికార్జున హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రపంచానికి రామాయణం లాంటి గొప్ప గ్రంథాన్ని అందించిన దార్శనికుడు మహర్షి వాల్మీకి అని కొనియాడారు. వాల్మీకుల సంక్షేమానికి సీఎం జగన్ చిత్తశుద్ధితో కృషి చేస్తున్నారన్నారు. ఎస్టీ జాబితాలో వాల్మీకులను చేర్చే అంశంపై అసెంబ్లీలో ఏకగ్రీవ తీర్మానం చేసి కేంద్రానికి ఏనాడో జగన్ ప్రభుత్వం పంపిందని గుర్తు చేశారు. అక్కడి నుంచి సరైన నిర్ణయం రావాల్సి ఉందన్నారు. గత ప్రభుత్వ హయాంలో అవకాశమున్నా వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చకుండా చంద్రబాబు మోసగించారన్నారు. తన స్వార్థం కోసం మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు వాల్మీకుల ఆత్మగౌరవాన్ని టీడీపీ పెద్దల వద్ద తాకట్టు పెట్టారని విమర్శించారు. మంచిచేసే ప్రభుత్వానికే వాల్మీకుల మద్దతు ఉండాలని పిలుపునిచ్చారు. అనంతరం ప్రముఖలంగా అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో తాలూకా వాల్మీకి సంఘం అధ్యక్షుడు బండి కిష్టప్ప, ఎస్టీ సిద్దప్ప, గ్రామ సర్పంచ్ ఓబులమ్మ, ఎంపీటీసీ బోయ రాజమ్మ, జంగమ కార్పొరేషన్ డైరెక్టర్ పుష్పావతి, సింగిల్ విండో అధ్యక్షుడు లక్ష్మీరెడ్డి, వజ్రవన్నూరు భీమప్ప, నాయకులు బోర్‌వెల్ నాగిరెడ్డి, గొర్ల రామంజి, బోమంతరాజు, ఎస్ఎమ్‌సీ చైర్మన్లు గంగాధర, మల్లికార్జున, శంకర్, నాగరాజు, హనుమంతు, సుంకప్ప, హనుమేష్ తదితరులు హాజరయ్యారు. కాగా, విగ్రహాల ప్రతిష్టాపన సందర్భంగా గ్రామంలో అక్క, చెల్లెమ్మలందరికీ వడిబియ్యం కార్యక్రమం చేపట్టారు. ఈ కారణంగా గ్రామం జన జాతరను తలపించింది. వివిధ రకాల దుకాణాలు వెలిసాయి. పౌరాణిక, బైలు నాటికలు ఆకట్టుకుంటున్నాయి.

డిజిటల్ అసిస్టెంట్‌పై దాడి



గాయపడిన గంగాధర్

తాడిపత్రి: పట్టణ పరిధిలోని సాయి బాబా గుడి సమీపంలో గుర్తు తెలియని వ్యక్తుల దాడిలో తాడిపత్రి మండలం దిగువపల్లి గ్రామ సచివాలయ డిజిటల్ అసిస్టెంట్ గంగాధర్ తీవ్రంగా గాయపడ్డాడు. పాత పెన్నా బ్రిడ్జి సమీపంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్ అధ్యక్షతన బుధవారం జరిగిన జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి హాజరై, తిరిగి సచివాలయానికి బైక్‌పై వెళుతున్న సమయంలో ఈ ఘటన చోటు చేసుకుంది. సాయిబాబా గుడి వద్దకు చేరుకోగానే ల్యాప్‌టాప్ పడిపోతున్నట్లుగా అనిపించడంతో వాహనాన్ని ఆపాడు. ఆ సమయంలో అటుగా వచ్చిన ముగ్గురు గుర్తు తెలియని వ్యక్తులు దబాయిస్తూ దాడి చేయడంతో తలకు తీవ్రగాయాలయ్యాయి. అటుగా వెళుతున్న వారు విషయాన్ని గమనించి గంగాధర్‌ను ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ఘటనపై సీఐ హమీద్ ఖాన్ కేసు నమోదు చేశారు.

సమస్యల పరిష్కారంపై నిర్లక్ష్యం వీడండి

- జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో జేసీ కేతన్‌గార్గ్



అర్జీలు పరిశీలిస్తున్న జేసీ కేతన్‌గార్గ్, తదితరులు

తాడిపత్రి టౌన్: ప్రజలు అర్జీల రూపంలో తెలిపిన సమస్యల పరిష్కారంపై నిర్లక్షం వీడాలని ఆయా శాఖల అధికారులను జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్ ఆదేశించారు. స్థానిక ఎస్ఎల్‌వీ ఫంక్షన్ హాల్‌లో బుధవారం నిర్వహించిన జగనన్నకు చెబుదాం మండల స్థాయి స్పందన గ్రీవెన్స్‌కు ఆయన అధ్యక్షత వహించారు. కార్యక్రమానికి జిల్లా స్థాయి అధికారులందరూ హాజరయ్యారు. ప్రతి అర్జీని జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్, డీఆర్‌డీఏ పీడీ నరసింహారెడ్డి, ఆర్డీఓ గ్రంధి వెంకటేష్ స్వీకరించి, పరిశీలించారు. సమస్య తీవ్రతను అర్జీదారులతో అడిగి తెలుసుకున్నారు. అనంతరం పరిష్కరానికి చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ.. గ్రామ స్థాయి లోని సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. ఈ క్రమంలో ప్రభుత్వ ఆదేశాల మేరకు మండల స్థాయి జగనన్నకు చెబుదాం స్పందన గ్రీవెన్స్‌ను పతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ పథకాలు అందేలా చూడాలన్నారు. కార్యక్రమంలో తాడిపత్రి మున్సిపల్ కమిషనర్ రవి, తహసీల్దార్ అలెగ్జాండర్, డిప్యూటీ తహసీల్దార్ రాంబాబు, ఎంపీడీఓ రంగరావు, ఈఓఆర్డీ జిలాన్‌బాషా, ఎస్ఐ గౌస్ మహ్మమద్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఐలయ్య, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు కల్పన, లక్ష్మీదేవి, హౌసింగ్ ఏఈ శ్రీదేవి, ఆర్ఐ కరుణాకర్‌రెడ్డి, ఏపీఎం సునీత, ట్రాన్స్‌కో ఏఈ సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

సబ్ రిజిస్టర్ కార్యాలయం తనిఖీ : జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి వచ్చిన జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్ స్థానిక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని తనిఖీ చేసారు. భూ రీ సర్వేపూర్తి అయిన గ్రామాలలో ఎల్‌పీఎంల వారీగా రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఎలా జరుగుతుందో సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయాన్ని పరిశీలించారు.

ఇళ్ల నిర్మాణానికి రేపటి నుంచి మెగా డ్రైవ్

అనంతపురం అర్బన్: నవరత్నాలు– పేదలందరికీ ఇళ్లు పథకం కింద చేపట్టిన ఇళ్ల నిర్మాణాల పూర్తికి డిసెంబర్ 1 నుంచి జనవరి 31 వరకు మెగా డ్రైవ్ చేపట్టాలని కలెక్టర్ గౌతమి అధికారులను ఆదేశించారు. ఇళ్ల నిర్మాణం అంశంపై కలెక్టర్ బుధవారం కలెక్టరేట్‌లోని రెవెన్యూభవన్‌లో హౌసింగ్ పీడీ నరసింహారెడ్డితో కలిసి అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అధికారులు బృందంగా లబ్ధిదారులకు వద్దకు వెళ్లి అవగాహన కల్పించి ఇంటి నిర్మాణం చేపట్టేలా చైతన్యపర్చాలన్నారు. ఈ ప్రక్రియలో ఎంపీడీఓలు, మునిసిపల్ కమిషనర్లు, ప్రత్యేక అధికారులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, వార్డు ఎమినిటీ కార్యదర్శులు భాగస్వాములవ్వాలని చెప్పారు. లక్ష్యానికి అనుగుణంగాగడువులోగా ఇళ్ల నిర్మాణం పూర్తి చేసేందుకు కార్యాచరణ ప్రణాళిక రూపొందించుకోవాలని సూచించారు. లబ్ధిదారులకు ఆర్థిక ఇబ్బందులు ఉంటే అదనపు రుణం మంజూరు చేయించాలని ఆదేశించారు. ఆప్షన్–3 ఇళ్ల నిర్మాణ విషయంలో కాంట్రాక్టర్లతో ఎప్పటికప్పుడు మాట్లాడుతూ పనులు వేగవంతం చేయాలనన్నారు. సమావేశంలో డిప్యూటీ కలెక్టర్ వెంకటేశ్వర్లు, నగర పాలక కమిషనర్ భాగ్యలక్ష్మి, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ ఎహషాన్‌బాషా, మెప్మా పీడీ విజయలక్ష్మి, పరిశ్రమల కేంద్రం జీఎం నాగరాజ్, డీఎల్‌డీఓలు ఓబులమ్మ, శంకర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

దంపతులపై కత్తితో దాడి

తాడిపత్రి: ఓ ఇంట్లో చొరబడిన దుండగుడు కత్తితో దంపతులపై దాడి చేసి ఉడాయించాడు. ఘటనలో తీవ్రంగా గాయపడిన వివాహిత చావుబతుకుల మధ్య కొట్టుమిట్టాడుతూ ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. పోలీసులు తెలిపిన మేరకు... తాడిపత్రిలోని కాలువగడ్డ వీధిలో నివాసముంటున్న రమాదేవి బుధవారం తెల్లవారుజామున ముంగిట ముగ్గు వేసి ఇంట్లోకి వెళుతున్న సమయంలో వెనువెంటనే ఓ దుండగుడు చొరబడ్డాడు. విషయాన్ని గమనించని ఆమె వంట గదిలోకి వెళ్లగానే రమాదేవి నోరు నొక్కిపెట్టి తన వెంట తీసుకెళ్లిన కత్తితో గొంతు కోశాడు. అదే సమయంలో అక్కడకు చేరుకున్న ఆమె భర్త, విశ్రాంత సైనికోద్యోగి వెంకట్రామిరెడ్డి అడ్డుకోవడంతో రమాదేవిని పక్కకు తోసి, వెంకట్రామిరెడ్డి పొట్టలో పొడిచి ఉడాయించాడు. సమాచారం అందుకున్న బంధువులు వెంటనే అక్కడకు చేరుకుని క్షతగాత్రులను హుటాహుటిన స్థానిక ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురానికి తరలించారు. కాగా, ఆగంతకుడు ఎలాంటి వస్తువులను చోరీ చేయలేదు. ఘటనపై సీఐ హమీద్‌ఖాన్ కేసు నమోదు చేశారు.

క్లుప్తంగా

క్రీడల్లో ఓటీపీఆర్ఐ విద్యార్థుల సత్తా



విద్యార్థులను అభినందిస్తున్న ఓటీపీఆర్ఐ డైరెక్టర్ ప్రొఫెసర్ బి.దుర్గాప్రసాద్

అనంతపురం: 62వ జాతీయ ఫార్మసీ వారోత్సవాల సందర్భంగా రైపర్ కళాశాలలో నవంబర్ 20 నుంచి 25 వరకూ జరిగిన క్రీడా పోటీల్లో జేఎన్‌టీయూఏ-ఓటీపీఆర్ఐ ఫార్మసీ విద్యార్థులు సత్తా చాటారు. క్రికెట్‌లో రన్నరప్, షాట్‌పుట్‌లో శ్రీనాథ్ మొదటి స్థానం, 100 మీటర్ల పరుగు పందెంలో వంశీకృష్ణ మూడో స్థానం, అమ్మాయిల విభాగంలో 100 మీటర్ల పరుగు పందెంలో నందిని రెండో స్థానం, షాట్‌పుట్‌లో అనిత మూడో స్థానం దక్కించుకున్నారు. ఓటీపీఆర్ఐ డైరెక్టర్ జేఎన్‌టీయూ అనంతపురం పాలకమండలి సభ్యుడు ప్రొఫెసర్ బి.దుర్గాప్రసాద్ విద్యార్థులను అభినందించారు.

చంద్రబాబుకు దళితులంటే చిన్నచూపు

- ఆర్టీసీ జోనల్ చైర్‌పర్సన్ మాల్యవంతం మంజుల



అనంతపురం కార్పొరేషన్: టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు, ఆ పార్టీ నాయకులకు దళితులంటే చిన్నచూపు అని ఆర్టీసీ జోనల్ చైర్‌పర్సన్ మాల్యవంతం మంజుల ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం ఆమె ఓ ప్రకటన విడుదల చేశారు. పుంగనూరులోని కట్టకింద పాళ్యం దళిత వాడకు చెందిన రాజెమ్మపై దాడికి పాల్పడిన టీడీపీ గుండాలపై పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలన్నారు. అగ్రవర్ణ అహంకార పోకడలతో ఇళ్ల మీద దాడి చేయడం దురదృష్టకరమన్నారు. గతంలోనూ టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు దళితులుగా ఎవరైనా పుట్టాలని కోరుకుంటారా అని వ్యాఖ్యలు చేసినట్లు గుర్తు చేశారు. ప్రజలు అన్నింటినీ గమనిస్తున్నారని.. రానున్న ఎన్నికల్లో టీడీపీకి గట్టిగా బుద్ధి చెబుతారన్నారు.

వ్యవసాయ ఇన్‌పుట్ డీలర్లకు పరీక్ష



మాట్లాడుతున్న డిప్లొమా కోర్సు కన్సల్టెంట్ కాంచన్

అనంతపురం అగ్రికల్చర్: వ్యవసాయశాఖ పరిధిలో విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు, ఇతరత్రా ఇన్‌పుట్స్ క్రయ విక్రయాలు సాగించే డీలర్లకు బుధవారం పరీక్ష నిర్వహించారు. స్థానిక కృషిభవన్‌లో వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ (ఆత్మ), జిల్లా వనరుల కేంద్రం (డీఆర్‌సీ) డీపీడీ మద్దిలేటి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 2022-23కు సంబంధించి 52 వారాల డిప్లొమా ఇన్ అగ్రికల్చర్ ఎక్స్‌టెన్షన్ సర్వీసెస్ ఫర్ ఇన్‌పుట్ డీలర్స్ (డీఏఈఎస్ఐ) కోర్సు చేస్తున్న డీలర్లు 40 మంది హాజరయ్యారు. హైదరాబాద్, రాజేంద్రనగర్‌కు చెందిన నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అగ్రికల్చర్ ఎక్స్‌టెన్షన్ మేనేజ్‌మెంట్ (మేనేజ్) సంస్థ రాష్ట్ర స్థాయి కన్సల్టెంట్ కాంచన్, ఫెసిలిటేటర్స్ డాక్టర్ లక్ష్మిరెడ్డి, డాక్టర్ లక్ష్మణ్ తదితరుల సమక్షంలో జరిగింది. రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు అందించడంతో పాటు సకాలంలో సరైన సూచనలు ఇవ్వడానికి వీలుగా విషయ పరిజ్ఞానం పెంచుకునేందుకు డీలర్లందరికీ కోర్సుతో పాటు ధ్రువీకరణ పత్రం తప్పనిసరి అన్నారు. రైతులకు మెరుగైన సేవలందించడంలో వ్యవసాయశాఖ అధికారులు, శాస్త్రవేత్తలతో పాటు డీలర్లు కూడా క్రియాశీల పాత్ర పోషించాలని సూచించారు.

నేడు 'వై ఏపీ నీడ్స్ జగన్'

ఆత్మకూరు: మండలంలోని మదిగుబ్బ గ్రామంలో గురువారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సర్పంచ్ నరసింహ (దాదా) బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. మండల స్థాయి అధికారులతో పాటు, ప్రజా ప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని పిలుపునిచ్చారు.

వంద శాతం ఉత్తీర్ణతే లక్ష్యం



సూచనలిస్తున్న సమగ్రశిక్ష అడిషనల్ ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ వరప్రసాద్ రావు

ఆత్మకూరు: పరీక్షలు దగ్గర పడుతుండటంతో విద్యార్థినులు కష్టపడి చదివి వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని సమగ్రశిక్ష అడిషనల్ ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ వరప్రసాద్ రావు సూచించారు. బుధవారం స్థానిక కస్తూర్బా పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. టైం టేబుల్ ప్రకారం చదువుకోవాలని తెలిపారు. ఉపాధ్యాయులు కూడా నిర్లక్ష్యంగా ఉండొద్దని తెలిపారు. వెనుకబడిన వారిని గుర్తించి ఉత్తీర్ణత శాతం పెంచేలా కృషి చేయాలన్నారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. మెనూ ప్రకారం భోజనాన్ని రుచిగా వండాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ లీమారోజ్ పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీతోనే పేదలకు న్యాయం

- దొంగ ఓట్లతో గెలిచే నైజం టీడీపీ నాయకులదే
- జనవరి నుంచి రూ.3 వేల పింఛన్
- ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి





రుద్రంపేట పంచాయతీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి, కార్యక్రమానికి హాజరైన మహిళలు

అనంతపురం రూరల్: గతంలో ఏ ప్రభుత్వాలు చేయని విధంగా వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత పేదలకు అన్ని విధాలా న్యాయం జరిగింది. రాజకీయాలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందుతున్నాయని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి అన్నారు. బుధవారం రుద్రంపేట పంచాయతీతో పాటు నగరంలోని 23వ డివిజన్ పరిధిలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరించారు. ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ.. అభివృద్ధి సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమన్నారు. వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మరోసారి ముఖ్యమంత్రి అయితేనే రాష్ట్రం అన్ని విధాలా అభివృద్ధి చెందుతుందన్నారు. ప్రజలకు మేలు జరుగుతుంటే ప్రతిపక్ష పార్టీల నాయకులు తట్టుకోలేకపోతురన్నారని మండిపడ్డారు. ఎల్లో మీడియాను అడ్డంపెట్టుకుని ప్రభుత్వంపై దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. ప్రజల మద్దతు కోల్పోయిన టీడీపీ నాయకుల పరిస్థితి ఆడలేక మద్దెల ఓడు అన్నట్లు ఉందన్నారు. ఓట్లపై కొత్త డ్రామాకు తెరలేపారన్నారు. దొంగ ఓట్లతో గెలుపొందే నైజం టీడీపీ నాయకులకే చెల్లుతుందన్నారు. టీడీపీ దొంగల పార్టీ అన్నారు. అధికారంలో ఉన్న సమయంలో ప్రజా సంక్షేమాన్ని గాలికొదిలేసి తమ పార్టీ నాయకులకు దోచిపెట్టిన టీడీపీ నాయకులకు వైఎస్సార్‌సీపీని విమర్శించే నైతిక హక్కులేదన్నారు. 2024 ఎన్నికల్లో మరోసారి వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రిగా చేసుకోవడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని తెలిపారు.

నగరానికి దీటుగా పంచాయతీల అభివృద్ధి

నగరానికి దీటుగా నియోజకవర్గ పరిధిలోని నాలుగు పంచాయతీలు అభివృద్ధి పథంలో పయనిస్తున్నాయన్నారు. గత టీడీపీ రుద్రంపేట పంచాయతీలో కనీసం మౌలిక వసతులు కూడా కల్పించలేదన్నారు. తమ పార్టీ అధికారంలోకి వచ్చిన నాలుగేళ్లలోనే పంచాయతీ రూపురేఖలు మారిపోయాయన్నారు. రూ.42 కోట్లు వెచ్చించి సిమెంట్ రోడ్లు, డ్రైనేజీలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ పద్మావతి, ఎంపీటీసీలు మహబూబీ, లక్ష్మీనారాయణమ్మ, జేసీఎస్ కన్వీనర్ ఆలమూరు శ్రీనివాసరెడ్డి, వైఎస్సార్‌సీపీ రూరల్ క్లస్టర్ కన్వీనర్ హుస్సేన్, 23వ డివిజన్ కార్పొరేటర్ హరిత, మార్కెట్‌యార్డ్ వైస్ చైర్మెన్ ఓబిరెడ్డి, జేసీఎస్ కన్వీనర్ చింతకుంట మధు, వైఎస్సార్‌సీపీ నగరాధ్యక్షురాలు కృష్ణవేణి, వైఎస్సార్‌సీపీ నాయకులు సాధిక్‌వలి, కుళ్లాయప్ప, చంద్రశేఖర్ రెడ్డి, రాఘవరెడ్డి, రాజారత్నం, రాజునాయక్, రామచంద్రారెడ్డి, పురుషోత్తం, పోతులయ్య, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఆధునిక హంగులతో అతిథి గృహం

ఆధునిక హంగులతో నగరపాలక సంస్థ అతిథిగృహాన్ని ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటామని మేయర్ వసీం పేర్కొన్నారు. బుధవారం నగరపాలక సంస్థ అతిథి గృహాన్ని డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్ రెడ్డి, వాసంతి సాహిత్య, కమిషనర్ భాగ్యలక్ష్మితో కలిసి మేయర్ పరిశీలించారు. శిథిలావస్థకు చేరుకున్న గృహం స్థానంలో నూతన గృహాన్ని ఏర్పాటు చేయాలని మేయర్, డిప్యూటీ మేయర్లు భావించారు. కమర్షియల్ కాంప్లెక్స్‌తో పాటు థర్డ్ పార్టీతో డిజైన్ చేయించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో పార్టీ మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షుడు సైఫుల్లాబేగ్, కార్పొరేటర్లు కమల్‌భూషణ్, ఇషాక్, నాయకులు ఖాజా, శ్రీనివాసులు, ఈఈ సూర్యనారాయణ, డీఈ దాక్షాయణి, ఏఈ ఉమామహేశ్వరి పాల్గొన్నారు.

ఆత్మకూరు: పార్టీలతో సంబంధం లేకుండా అర్హులందరికీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో సంక్షేమ పథకాలు అందాయని పార్టీ జిల్లా అధికార ప్రతినిధి చంద్రశేఖర్‌రెడ్డి, ఎంపీపీ హేమలత తెలిపారు. బుధవారం మండలంలోని బి.యాలేరులో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి నియోజకవర్గ ప్రజల సంక్షేమం కోసం చాలా ఖర్చు చేశారని తెలిపారు. మహిళలకు డెయిరీ ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. జగనన్న ఇళ్ల నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయని తెలిపారు. కార్యక్రమంలో జేసీఎస్ మండల ఇన్‌చార్జ్ వడ్డుపల్లి నరసింహారెడ్డి, బీసీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు బాలపోతన్న, సర్పంచ్ రేణుకమ్మ, ఎంపీటీసీ లక్ష్మీదేవి, కన్వీనర్ లక్ష్మీనరసింహులు ,యూత్ కన్వీనర్ గూలి కొండారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు ఈశ్వరరెడ్డి, నరసింహులు, మహేష్, గంగాధర్‌రెడ్డి, నాగరాజు, ఎర్రిస్వామి, పెద్దన్న, వడ్డే ఈశ్వరయ్య పాల్గొన్నారు.



సున్నపు వీధిలో పథకాల బోర్డును ఆవిష్కరించిన మేయర్ వసీం, డిప్యూటీ మేయర్లు కోగటం, వాసంతి

కనగానపల్లి(రాప్తాడు): సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న నవరత్నాల్లోని పథకాలు ఆదర్శంగా నిలుస్తున్నాయని రాప్తాడు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ జూటూరు శేఖర్ తెలిపారు. మండలంలోని గొందిరెడ్డిపల్లిలో బుధవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల ఎన్నికల ఇన్‌చార్జ్ చిట్రెడ్డి సత్యనారాయణరెడ్డి, బీసీ సెల్ కన్వీనర్ పసుపుల ఆది తదితరులు పాల్గొన్నారు.



ఆత్మకూరు మండలం బి.యాలేరులో పథకాల బోర్డు ఆవిష్కరణ



రాప్తాడు మండలం గొందిరెడ్డిపల్లిలో పథకాలను వివరిస్తున్న నాయకులు

రూ.800 కోట్లతో అభివృద్ధి పనులు

అనంతపురం కార్పొరేషన్: ఎన్నికల మేనిఫెస్టోను పవిత్ర గ్రంథంగా భావించిన సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి.. అన్ని హామీలను నెరవేరుస్తున్నారని మేయర్ వసీం పేర్కొన్నారు. బుధవారం నగరంలోని 19వ సచివాలయ పరిధిలోని సున్నపు వీధిలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం జరిగింది. డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్ రెడ్డి, వాసంతి సాహిత్యతో కలిసి సంక్షేమ, అభివృద్ధి బోర్డును మేయర్ ఆవిష్కరించారు. నగరపాలక సంస్థ చరిత్రలో లేని విధంగా రూ.800 కోట్లతో అభివృద్ధి చేశామన్నారు. సంక్షేమ పథకాలు యథావిధిగా కొనసాగాలంటే మళ్లీ సీఎంగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి రావాలన్నారు. అదేవిధంగా నగరంలోని 6వ సచివాలయం రెవెన్యూ కాలనీ, 42వ సచివాలయం శారదనగర్, 52వ సచివాలయం శ్రీనగర్ కాలనీల్లో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం జరిగింది. ఈ ప్రాంతాల్లో డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్ రెడ్డి, పార్టీ క్లస్టర్ అధ్యక్షుడు పీవీ రమణారెడ్డి, జగదీష్, మధు, ఓబిరెడ్డి, కార్పొరేటర్లు బాబాఫక్రుద్దీన్, హరిత, కొండ్రెడ్డి రాధా సంక్షేమ, అభివృద్ధి బోర్డును ఆవిష్కరించి, జెండాను ఎగురవేశారు. అనంతరం ఆయా సచివాలయాల పరిధిలో గత టీడీపీ ప్రభుత్వం, ప్రస్తుత వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం తేడాను ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో జేసీఎస్ లక్ష్మణ్ణ, చింతకుంట మధు, వీరా రామకృష్ణారెడ్డి, పార్టీ జిల్లా కార్యదర్శి రాధాకృష్ణ, ఎంఎల్‌ఓ అమర్నాథ్ రెడ్డి, దామోదర్ రెడ్డి, మార్కెట్‌యార్డు డైరెక్టర్ మంజునాథ్, తదితరులు పాల్గొన్నారు.

అంధుల ఆశ్రమానికి 'అమ్మ' చేయూత

అనంతపురం కల్చరల్: స్థానిక అరవింద నగర్‌లో ఉన్న అనాథ అంధుల ఆశ్రమంలో నాలుగు రోజుల క్రితం బోర్ చెడిపోయింది. విద్యార్థులు ఇబ్బందులు పడుతున్న విషయం తెలుసుకున్న అమ్మ సంస్థ అధ్యక్షుడు తరిమెల రమణారెడ్డి మానవత్వంతో స్పందించారు. బుధవారం రూ.60 వేలు విలువ చేసే బోర్‌కు మరమ్మతు చేయించి, రూ.20 వేలు విలువైన ఫ్యాన్లు, ట్యూబ్‌లైట్లు, ప్యాడ్స్ అందించారు. వికలాంగులు వృద్ధుల సంక్షేమ శాఖ ఏడీ రసూల్, వార్డెన్ ప్రమీళమ్మ మాట్లాడుతూ.. అమ్మ రమణారెడ్డి నిరుపమాన సేవలందిస్తుంటారన్నారు. ఆ కోవలోనే ఆశ్రమానికి బోర్ సరి చేయించి అంధులకు అండగా నిలవడం అభినందనీయమన్నారు.



మోటార్ అందజేస్తున్న రమణారెడ్డి

ఓట్ల తొలగింపునకు పరిటాల సునీత కుట్ర

రాప్తాడురూరల్: రాప్తాడు నియోజవవర్గంలో అర్హులైన ఓట్ల తొలిగింపునకు మాజీమంత్రి పరిటాల సునీత కుట్ర పనుతున్నారు. నిష్పక్షపాతంగా విచారణ జరిపించి ఓట్లు తొలగించకుండా చర్యలు తీసుకోవాలని నియోజకవర్గ ఎలక్ట్రోల్ అధికారి వెంకటేశ్వర్లును వైస్సార్‌సీపీ నాయకులు కోరారు. బుధవారం వైఎస్సార్‌సీపీ రాప్తాడు నియోజకవర్గ ఎలక్షన్ ఇన్‌చార్జ్ ఓబుగారి హరినాథ్ రెడ్డి, పార్టీ రాప్తాడు మండల కన్వీనర్ జూటూరు శేఖర్, బీసీ సెల్ మండల నాయకుల పసుపుల ఆదినారాయణ, సోషల్ మీడియా ఆత్మకూరు మండల కన్వీనర్ నాగమల్లేశ్వర్ రెడ్డి, ఐటీ వింగ్ అనంతపురం రూరల్ మండల కన్వీనర్ చంద్ర, ఐటీ వింగ్ జోనల్ ఇన్‌చార్జ్ సుధీర్ రెడ్డి, ఐటీ వింగ్ సభ్యులు సంజీవరెడ్డి తదితరులు వినతిపత్రం అందజేశారు. బీఎల్‌ఓలను పరిటాల సునీత బెదిరిస్తూ వారిపై ఒత్తిడి తెచ్చి 27 వేల దరఖాస్తులను తొలగించేందుకు బీఎల్‌ఓల నుంచి స్క్రూటినీ లేకుండా ఎన్నికల అధికారులకు పంపారన్నారు. స్క్రూటినీ లేకుండా ఎలా పంపుతారని వారు ప్రశ్నించారు. అంతేకాకుండా మరో 23 దరఖాస్తులు తొలిగింపునకు సిద్ధంగా ఉన్నాయని ఆమె ప్రకటన చేశారన్నారు. నియోజకవర్గంలో మొత్తం 50 వేల ఓట్లను తొలగించాలని పరిటాల సునీత కుట్ర పన్నుతోందన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా బీఎల్‌ఓలతో సమావేశాలు ఏర్పాటు చేసి విచారిస్తే మరిన్ని విషయాలు వెలుగు చూస్తాయన్నారు.

నివాళి

రాప్తాడురూరల్: గ్యాస్ లీకై చోటుచేసుకున్న ప్రమాదంలో చికిత్స పొందుతూ మృతి చెందిన అనంతపురం రూరల్ మండలం కక్కలపల్లికి చెందిన బోయ రామాంజనమ్మ మృతదేహానికి వైఎస్సార్‌సీపీ రాప్తాడు నియోజకవర్గ సీనియర్ నాయకుడు తోపుదుర్తి చంద్రశేఖర్‌రెడ్డి నివాళులర్పించారు. కర్నూలులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రామాంజనమ్మ మంగళవారం మృతి చెందగా బుధవారం మృతదేహాన్ని గ్రామానికి తీసుకొచ్చారు. భర్త వెంకటరాముడు ఆరోగ్య పరిస్థితిని చంద్రశేఖర్‌రెడ్డి అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట రూరల్ మండల జెడ్పీటీసీ సభ్యుడు జూటూరు చంద్రకుమార్, సర్పంచ్ గార్లదిన్నె కృష్ణయ్య తదితరులు ఉన్నారు.

రూసా డిజిటల్ బ్లాక్ ప్రారంభం

అనంతపురం ఎడ్యుకేషన్: ఎస్ఎస్‌బీఎన్ కళాశాలలో రూ. 2 కోట్లతో నిర్మించిన రూసా డిజిటల్ బ్లాక్ భవనాన్ని కలెక్టర్ గౌతమి బుధవారం ప్రారంభించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. డిజిటల్ తరగతులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రస్తుత పోటీకు అనుగుణంగా సన్నద్ధం కావాలని సూచించారు. డిజిటల్ బ్లాక్ భవనానికి రూసా రూ. 97 లక్షలు నిధులు మంజూరు చేసిందని, తక్కిన మొత్తం కళాశాల మేనేజ్‌మెంట్ ట్రస్ట్ నుంచి నిధులు సమకూర్చామని కళాశాల ప్రిన్సిపల్ ప్రభాకర రాజు తెలిపారు. ఈ డిజిటల్ బ్లాక్‌లో ఆరు డిజిటల్ తరగతి గదులు, వర్చువల్ క్లాస్ రూమ్ నిర్మించామన్నారు. అలాగే రూ.60 లక్షలతో ల్యాబ్ ఎక్విప్‌మెంట్ ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో ఏడీఎస్ఏ ట్రస్ట్ ప్రెసిడెంట్ పీవీ రమణారెడ్డి, కరస్పాండెంట్ పీఎల్ఎన్ రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ పరుచూరి రమేష్ బాబు, సెక్రెటరీ నిర్మలమ్మ, మెంబర్లు వేణుగోపాల్, రామిరెడ్డి, రవీంద్ర, ఎర్రిస్వామి, హిమక పాల్గొన్నారు.

నేడు కనకదాస జయంతి

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో గురువారం కనకదాస జయంతి జరగనుంది. పాలిమర్ సైన్సెస్ సెమినార్ హాలులో జరిగే ఈ కార్యక్రమానికి ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ చింతా సుధాకర్, ఎంపీ గోరంట్ల మాధవ్, సుప్రసిద్ధ రచయిత, సినీ దర్శకుడు బాలగొండ ఆంజనేయులు హాజరవుతారని సదస్సు కన్వీనర్/సీడీసీ డీన్ ప్రొఫెసర్ కే.రాంగోపాల్ తెలిపారు.

పరీక్ష కేంద్రాల పరిశీలన

అనంతపురం: ఎల్ఎల్‌బీ రెండో సెమిస్టర్ పరీక్ష కేంద్రాలను శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ చింతా సుధాకర్ బుధవారం పరిశీలించారు. పరీక్ష కేంద్రంలోని వసతులు, ఇన్విజిలేటర్ల పని తీరుపై ఆరా తీశారు. ఆడిటోరియం, ఇంజినీరింగ్ కళాశాలల్లోని పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు. పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎంపీ లక్ష్మయ్య, ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఏ.కృష్ణ కుమారి, డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్స్ ప్రొఫెసర్ జీవీ రమణ, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ శ్రీరాములు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

నాగత్రిశూలపాణి మృతి తీరని లోటు

అనంతపురం కల్చరల్: డాక్టర్ నాగత్రిశూలపాణి మరణంతో జిల్లాలో సంస్కృత భాషకు తీరని లోటు ఏర్పడిందని స్వామి అనుపమానంద మహారాజ్ ఆవేదన చెందారు. స్థానిక హెచ్చెల్సీ కాలనీలోని రామకృష్ణ సేవా సమితిలో సంస్కృత పండితుడు డాక్టర్ నాగత్రిశూలపాణి సంస్మరణ సభ బుధవారం జరిగింది. రామకృష్ణ సేవా సమితి వ్యవస్థాపకుడు గుత్తి శ్రీధరమూర్తి నేతృత్వంలో జరిగిన కార్యక్రమంలో వైఎస్సార్ జిల్లా రామకృష్ణ మిషన్ నుంచి స్వామి అనుపమానంద మహారాజ్ విశిష్ట అతిథిగా విచ్చేసి మాట్లాడారు. దశాబ్దాల పాటూ అనంత ఆధ్యాత్మిక రంగానికి ముఖ్యంగా రామకృష్ణ మిషన్ అనుబంధ సంఘాలకు నాగత్రిశూలపాణి చేసిన సేవలు చిరస్మరణీయమన్నారు. అనంతరం రామకృష్ణ సేవా సమితి నూతన అధ్యక్షునిగా డాక్టర్ కృష్ణశశి, ఉపాధ్యక్షుడిగా శివరామిరెడ్డి, సెక్రటరీగా ప్రవీణ్‌కుమార్ ఏకగ్రీవంగా ఎంపికై బాధ్యతలు తీసుకున్నారు.



మాట్లాడుతున్న స్వామి అనుపమానంద మహారాజ్

3న జిల్లా స్థాయి సబ్ జూనియర్ హ్యాండ్‌బాల్ పోటీలు

అనంతపురం: జిల్లా స్థాయి సబ్ జూనియర్స్ బాలబాలికల హ్యాండ్‌బాల్ పోటీలు డిసెంబర్ 3న అనంతపురంలోని న్యూటౌన్ జూనియర్ కాలేజీలో నిర్వహించనున్నారు. ఈ మేరకు జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి సాకే శివశంకర్ బుధవారం వెల్లడించారు. 2008, జనవరి 1 తర్వాత జన్మించిన బాలబాలికల అర్హులు. డిసెంబర్ 8 నుంచి 10వ తేదీ వరకూ గుంటూరు జిల్లా తెనాలిలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రాతినిధ్యం వహించే జట్లకు ఎంపిక చేయనున్నారు.

విశ్రాంత ఏపీజీబీ అధికారుల నిరసన

అనంతపురం అగ్రికల్చర్: కంప్యూటర్ ఇంక్రిమెంట్ ఇవ్వకుండా ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు (ఏపీజీబీ) యాజమాన్యం అన్యాయం చేస్తోందని రిటైర్డ్ రీజినల్ రూరల్ బ్యాంక్స్ వెల్ఫేర్ సొసైటీ జాతీయ ప్రధాన కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి విమర్శించారు. ఏపీజీబీ అనంతపురం యూనిట్ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక ఏపీజీబీ ప్రాంతీయ కార్యాలయం ఎదుట పలువురు విశ్రాంత అధికారులు నిరసన చేపట్టారు. 2018 ఏప్రిల్‌కు ముందు రిటైర్డ్ అయిన వాళ్లకు కంప్యూటర్ ఇంక్రిమెంట్ ఇవ్వడంలో యాజమాన్యం నిర్లక్ష్యం చేస్తోందన్నారు. దీంతో పెన్షన్‌లో కోత పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. కోర్టులు ఆదేశించినా పట్టించుకోవడం లేదని విమర్శించారు. డిసెంబర్ 4న వైఎస్సార్ కడపలో ఉన్న ఏపీజీబీ ప్రధాన కార్యాలయం ఎదుట మహాధర్నా తలపెట్టామన్నారు. ఐదు జిల్లాల నుంచి వందలాది మంది విశ్రాంత అధికారులు ఇందులో పాల్గొంటారని తెలిపారు. అనంతరం ఆర్ఎం శ్రీదేవిని కలిసి వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో సొసైటీ జిల్లా అధ్యక్షుడు రామచంద్ర, ప్రధాన కార్యదర్శి శ్రీరామరెడ్డి, నాయకులు ప్రతాపరెడ్డి, లక్ష్మీనరసయ్య, శ్రీరంగన్న, జయసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా కద్లే గౌరమ్మ రథోత్సవం



దీపాలు తీసుకెళ్తున్న మహిళలు

ఆత్మకూరు (రాప్తాడు): రాప్తాడు మండల కేంద్రంలో బుధవారం కద్లే గౌరమ్మ రథోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. మహిళలు, బాలికలు చక్కెర హారతులు పట్టుకుని స్వాగతం పలికారు. యువకులు బాణా సంచా కాల్చుతూ డ్రమ్ములు వాయిస్తూ నృత్యం చేశారు. పూలతో అలంకరించిన రథంలో గౌరిదేవి విగ్రహాన్ని ఊరేగించారు. వీరబ్రహ్మేంద్ర స్వామి వేషంలో చేసిన నృత్యాలు అలరించాయి.

ఉచిత శిక్షణ, ఉపాధి

అనంతపురం అగ్రికల్చర్: ప్రధాన మంత్రి కౌశల్ కేంద్రం ఆధ్వర్యంలో 45 రోజుల పాటు ఉచిత శిక్షణతో పాటు ఉపాధి అవకాశాలు కల్పించనున్నారు. ఈ మేరకు ఆ కేంద్రం అనంతపురం జిల్లా మేనేజర్ రాజశేఖర్ బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. అంబర్ ప్రాజెక్టు కింద కస్టమర్ కేర్ ఎగ్జిక్యూటివ్, రీటైల్ సేల్స్ అసోసియేట్స్ జాబ్ రోల్స్‌పై నైపుణ్యాభివృద్ధి శిక్షణ ఇవ్వనున్నారు. అలాగే కంప్యూటర్ ఆపరేటింగ్, సాఫ్ట్ స్కిల్స్, కస్టమర్ రిలేషన్ స్కిల్స్ అంశాలపై శిక్షణ ఉంటుంది. ఐటీఐ, ఇంటర్, డిప్లొమా, డిగ్రీ విద్యార్హత కలిగిన వారు అర్హులు. వివరాలకు అనంతపురంలోని రాజురోడ్డులో ఉన్న కౌశల్ కేంద్రం కార్యాలయం లేదా 93981 54460, 75696 59964లో సంప్రదించవచ్చు.

ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడిగా వెంకటేష్


అనంతపురం కల్చరల్: ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడిగా శిరిగుప్ప వెంకటేష్ ఏకగ్రీవంగా ఎంపికవడం ఆనందంగా ఉందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర నాయకుడు తిరువీధుల జగదీష్ అన్నారు. బుధవారం పాతూరులోని ఆయన కార్యాలయంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్ష కార్యదర్శులు వెంకటేష్, పోతుల మనోజ్‌ను సత్కరించారు. కార్యక్రమంలో సత్యరంగయ్య, సత్రశాల మంజునాథ్, కొవ్వూరు కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

గిరిజనుల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

అనంతపురం కల్చరల్: గిరిజనుల అభివృద్ధే లక్ష్యంగా జగన్ సర్కార్ కృషి చేస్తోంది. గిరిజనులు సీఎం జగన్‌కు రుణపడి ఉంటారని టీటీడీ బోర్డు పాలక మండలి సభ్యుడు అశ్వర్థనాయక్ అన్నారు. సిటీజన్ ఫోరం అనంతపురం ఆధ్వర్యంలో బుధవారం రాత్రి వైభవ్ సమావేశ మందిరంలో ప్రత్యేక సమావేశం జరిగింది. ఫోరం సభ్యులుగా ఉన్న టీటీడీ బోర్డు మెంబర్ అశ్వర్థనాయక్, జెఎన్‌టీయూ సెనేట్ మెంబర్‌గా ఎంపికైన హరిశ్చంద్రరామను సత్కరించారు. కార్యక్రమంలో సిటీజన్ ఫోరం అధ్యక్షుడు ఎల్.రామిరెడ్డి, సెక్రటరీ డాక్టర్ నారాయణప్ప, బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా సభ్యుడు సీనియర్ అడ్వొకేట్ రామిరెడ్డి, బషీర్ తదితరులు పాల్గొన్నారు.

పాలస్తీనాపై మారణహోమం ఆపాలి



కొవ్వొత్తులతో నిరసన వ్యక్తం చేస్తున్న దృశ్యం

అనంతపురం అర్బన్: పాలస్తీనాపై ఇజ్రాయిల్ చేస్తున్న మారణహోమాన్ని ఆపాలంటూ ఐద్వా, డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ, ఆవాజ్ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక టవర్ క్లాక్ వద్ద కొవ్వొత్తులతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఐద్వా రాష్ట్ర కోశాధికారి సావిత్రమ్మ మాట్లాడుతూ.. పాలస్తీనాపై ఇజ్రాయిల్ చేస్తున్న దాడులకు ప్రజలు బలవుతున్నారన్నారు. ఇజ్రాయిల్ మారణహోమానికి ఇప్పటికే గాజా పట్టణం నేలమట్టమైందన్నారు. ఆస్పత్రులు, పాఠశాలలపై బాంబు దాడులు చేస్తుండటంతో చిన్నపిల్లలు మరణిస్తున్నారన్నారు. కార్యక్రమంలో నాయకులు శ్యామలమ్మ , రాజేశ్వరి, పరమేశ్, నరసింహారెడ్డి, వలి, ప్రకాశ్, ఫరీదా, పాల్గొన్నారు.

'పని గంటలు పెంచాల్సిన అవసరం లేదు'

అనంతపురం కల్చరల్: శాస్త్ర సాంకేతికాభివృద్ధి పెరిగిపోయిన నేటి తరుణంలో పని గంటలు పెంచాల్సిన అవసరం ఏముందని మానవ హక్కుల సంఘం రాష్ట్ర నాయకుడు చంద్రశేఖర్ ప్రశ్నించారు. బుధవారం సాయంత్రం జనవిజ్ఞాన వేదిక కార్యాలయంలో సమాలోచన కార్యక్రమం జరిగింది. చంద్రశేఖర్,మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్, ఎస్ఎం బాషా తదితరులు మాట్లాడారు. నారాయణమూర్తి ప్రతిపాదించిన 70 గంటల ప్రతిపాదన పెట్టుబడిదారులకు లాభాలను పెంచడానికి ఉపయోగపడుతుందే తప్ప సామాన్యుడికి ప్రయోజనం లేదన్నారు. ఎస్సీ, ఎస్టీ జేఏసీ నాయకుడు శ్రీహరి సమన్వయకర్తగా వ్యవహరించారు.

నేడు రామగిరిలోఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి పర్యటన

రామగిరి: మండలంలోని పలు గ్రామాల్లో గురువారం ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి పర్యటించనున్నట్లు మండల కన్వీనర్ కర్రా హనుమంతరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నసనకోటలో ఆర్బీకే భవనాన్ని ప్రారంభించిన అనంతరం దుబ్బార్లపల్లి, పేరూరులో ఆర్బీకే భవనాలను ప్రారంభిస్తారని పేర్కొన్నారు. అనంతరం ఆయా గ్రామాల్లో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తారన్నారు.

భాషా నైపుణ్యాలు పెంపొందించాలి

ఆత్మకూరు: విద్యార్థుల్లో భాషా నైపుణ్యాలు పెంపొందించాలని ఎంఈఓ నరసింహారెడ్డి ఉపాధ్యాయులకు సూచించారు. బుధవారం స్కూల్ కాంప్లెక్స్ సమావేశాల్లో భాగంగా ఆత్మకూరు, తలుపూరు ఉన్నత పాఠశాలల్లో ఆత్మకూరు, బెళుగుప్ప, కూడేరు మండలాలకు చెందిన హిందీ, ఇంగ్లిష్ ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ.. ఇంగ్లిష్, హిందీ సబ్జెక్టుల్లో వెనుకబడిన విద్యార్థులపై శ్రద్ధ తీసుకోవాలని సూచించారు.

3న కార్తీక వనభోజనాలు

అనంతపురం టవర్‌క్లాక్: డిసెంబర్ 3న నిర్వహించే కార్తీక వనభోజన మహోత్సవాన్ని విజయవంతం చేయాలని రాయలసీమ బలిజ మహా సంఘం అధ్యక్షుడు వెంకటేష్ కోరారు. బుధవారం స్థానిక శ్రీనివాసనగర్‌లోని బాలాజీ కల్యాణ మండపంలో వన భోజన మహోత్సవంపై ఆయన విలేకరులతో మాట్లాడారు. అనంతపురం రూరల్ మండలం సోములదొడ్డిలోని అశ్వర్థనారాయణ కట్ట ఆలయ ప్రాంగణంలో వనభోజనలు ఉంటాయని పేర్కొన్నారు.

3న యూటీఎఫ్ సమావేశం

రామగిరి: హిందూపురంలోని సప్తగిరి కళాశాలలో డిసెంబర్ 3వ తేదీన యూటీఎఫ్ స్వర్ణోత్సవ జిల్లా కౌన్సిల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు శెట్టిపి జయచంద్రారెడ్డి తెలిపారు. బుధవారం మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్‌లో ఉపాధ్యాయులతో కలిసి పోస్టర్లను ఆవిష్కరించారు. ఉపాధ్యాయులందరూ హాజరై, విజయవంతం చేయాలని కోరారు. ఉపాధ్యాయులు శివయ్య, వినయ్ కుమార్‌రెడ్డి, సురేష్, శివారెడ్డి, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

క్రీడలు ఉత్సాహంగా నిర్వహిద్దాం

ఆత్మకూరు: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా 'ఆడుదాం ఆంధ్రా' కార్యక్రమంలో భాగంగా గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు క్రీడా పోటీలు నిర్వహిస్తోంది. అందరం సమష్టిగా పని చేసి, క్రీడా పోటీలను ఉత్సాహంగా నిర్వహిద్దామని ఎంపీడీఓ రఘునాథ్, ఎంపీపీ హేమలత తెలిపారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయితీ సెక్రటరీలకు ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంలో భాగంగా క్రీడా సామగ్రి అందజేశారు. డిసెంబర్ 15వ తేదీ నుంచి క్రీడా పోటీలు ప్రారంభం అవుతాయన్నారు.